# పిల్లికూన

పలకలాంటి ఆకాశంలో నక్షత్రాలు అక్షరాల్లా నిశ్శబ్దంగా వున్నాయి. నిద్రపోతున్న కుర్రాడికాళ్ళు 'మ్యావు' అన్నాయి. గుండె 'మ్యావు' అన్నది. కీచురాయి 'మ్యావు' అన్నది. పెద్దవాళ్ళ గుర్రులు 'మ్యావు, మ్యావు' అన్నాయి. కుర్రాడు కొంచెం కదిలాడు. ఇంకా నిద్రపోతున్నాడు. కలా కాక, నిజంకాక, మరేవో స్థితిలో కుర్రాడిముందు పిల్లికూన గెంతుతున్నది.

మూణ్ణాల కిందట ఎక్కణ్ణించో, ఓపిల్లివచ్చి అటక మీద అయిదుకూనల్ని పెట్టింది. అటకకింద చల్దన్నం తింటున్నప్పుడు మీద కూనలమూలుగులు ఆవకాయ ఊటలా కుర్రాడి నోరూరించేది. అటక ఆకాశంఅంత ఎత్తుండేది.

రెండురోజుల తరువాత ఒక్కొక్కపిల్లనీ నోటకరచుకొని అంతెత్తు అటకమీంచి ఛంగునగెంతి పిల్లలనన్నింటినీ మరోచోటుకి తీసుకుపోయింది. ఏడిళ్ళు తిప్పుతుంది.

ఆవేళ చల్దన్నం కుర్రాడికి సయించలేదు. అప్పడం ముక్క నంచుకొందికి ఉన్నా చల్ది దిగలేదు. ఏదో వెత్తిఅయినట్లనిపించింది. కానీ పెద్దవాళ్ళభయంచేత కుర్రాడు కంచం వట్టిది చేశాడు.

చల్దన్నంతిని బడికెళ్తున్నప్పుడుకూడా కుర్రాడి కేం తోచలేదు. పలకపుల్ల విరిగిపోయినట్టో, పెన్సిలు పారేసుకొ

న్నట్టో అనిపించింది. బళ్ళో మేష్టరు పిల్లిపాఠం చెప్పాడు. పాఠంతోపాటు కథ చెప్పాడు. పిల్లలు గొల్లుమంటూ నవ్వేరు. కుర్రాడు పాఠమే వినలేదు.

కుర్రాడికీ పిల్లిపిల్లలకీ ఏదో తెలిపలేని సంబంధం ఏర్పడ్డది. సాయంత్రం ఇంటికొచ్చేక గబగబా అటక దగ్గరకు వెళ్ళి బుర్ర పైకెత్తి చూశాడు. బ్రహ్మరాక్షసి అటకకి బూజు గెడ్డలా వుంది. కుర్రాడు చెవులు నిక్కపెట్టి విన్నాడు, ఏ చప్పుడైనా వినబడుతుందేమో అని. మెల్లగా ఏదో మూలుగు వినబడ్డది. కుర్రాడు భయపడ్డాడు. అది పిల్లిమూలుగే. నిర్ధారణ చేసుకొన్నాడు.

మేనత్త తిప్పించి ఇంటిల్లిపాదీ ఎవరింటికో వెళ్ళేరు. అత్త అటకెక్కి పాతావకాయ తీస్తున్నది. కుర్రాడు గబగబా అటకదగ్గరకు వచ్చాడు. నల్లని మేనత్త అటకతో కలిసిపోయి దుమ్ములగుండులాగ భయపెడుతూంది.

సరిగ్గా ఆ వేళకి మావ వచ్చేడు. అత్తని మావని చూడలేదు. మావ ఏవిటని అడిగేడు. కుర్రాడు, 'మావా! అటకమీద ఎలుగుబంటికాదూ?' అని ప్రశ్నించాడు. అత్తయ్య గతుక్కుమంది.

'అదుగో ఎలుగుబంటి' అన్నాడు మావయ్య.

'ఏదీ?' కుర్రాడు అటకంతా చూశాడు నిచ్చెన ఎక్కి.

'మీ అత్తయ్య' అన్నాడు మావ.

అత్తయ్య నవ్వుతూ మొగం దాగరంత చేసుకొంది. అత్తయ్య మావయ్య మొగుడు పెళ్ళాలు కాదు. అత్తయ్య మొగుడు అదేదో వూళ్ళో రెండేళ్ళాయి ఉన్నాడు. మావయ్యకి యింకా పెళ్ళి కాలేదు.

'ఇంట్లో ఎవరూ లేరులే' అన్నాడు మావ.

'ఏం!' అన్నది అత్త.

ఇద్దరూ నవ్వుకున్నారు. కుర్రాడి కేం అర్థంకాలేదు.

అటకసర్ది అత్త ఆవకాయ తీయడం మొదలెట్టింది. మెల్లగా ఓ మూలుగు వినబడ్డది. అత్త కాలితో కెతికి 'పిల్లి పిల్ల' అన్నది. కుర్రాడికి కాణీదొరికినట్టనిపించి మొగం వికసించింది.

'దీన్ని మరిచిపోయిందికాబోలు!'

'ఏమో!'

'తీసిపారీ–'

'ఆవకాయచేతులు.'

'నే నెక్కు-తా నత్తా.'

'ఊ.'

కుర్రాడు అటకెక్కి- పిల్లిని తీసేడు. చచ్చినట్టుంది. పిల్లికూనతో మెల్లిగా అటక దిగాడు. మావయ్య చేతిలో కాణీపెట్టి 'పోయి ఆడుకో' అన్నాడు.

కుర్రాడు ఛంగున ఎగిరి గెంతేడు. పిల్లిని తీసుకొని బయల్దేరాడు కాణీపెట్టి మూకుజంతికలు కొన్నాడు. పిల్లికి

పెడ్తే గతికిగతికి వొదిలింది. అత్త మామ నట్టింట్లో గుసగుస లాడుకొంటున్నారు.

పిల్లికి పాలుపోయించాలి. రోజూ పప్పు అన్నం కలిపి పెట్టాలి. పిల్లి పెద్దదయి బలిసాక దాంచేత ఎన్నో చేయించాలి. సర్కసులోలాగ ఎన్నో చేయించాలి.

కుర్రాడు పిల్లికూనను తీసుకొని డాబా మీదికి వెళ్ళాడు. దాంచేత మొగ్గలు వేయించాడు. రెండుకాళ్ళ మీదనే డాబాఅంతా నడిపించేడు. కడుపుమీద ఎక్కించుకొన్నాడు. పిట్టగోడమీద నిలబెట్టి కిందికి గెంతించేడు. చస్తినమ్మో అని పిల్లి ఫీట్లన్నీ చేసింది. ఫీటుకీ ఫీటుకీ మధ్య ఓ జంతిల్ ముక్క మేత వేశాడు.

సర్కసు చాలా బాగా అయింది. కుర్రాళ్ళందరినీ చేరేసి ఇక గమ్మత్తుగా సర్కస్ చేయించాలి. అవసరాన్ని బట్టి పిల్లి పిల్లే పులి అవుతుంది. సింహ మవుతుంది. ఏను గవుతుంది. గుర్ర మవుతుంది. కుర్రోడికో ఫీటు జ్ఞాపక మొచ్చింది. సింహంనోట్లో నోరు పెట్టాలి. దవడలు రెండూ సాగదీసి నోట్లో వేలు పెట్టాడు. పీనుగలాంటిపిల్లి దయ్యంలాగ బరికింది. కుర్రాడికి చెడ్డకోప మొచ్చి పందుంపుల్ల కొరడాతో పిల్లిని తెగ బాదాడు. మూలుగుతూ ఏడ్చింది కూన.

ఐపోయిం దేదో అయిపోయిందని పిల్లిని భుజాన వేసుకొని డాబా దిగేడా కుర్రాడు. అమ్మమ్మ ఎదురుగుండా వచ్చింది. వస్తూనే 'అ దెందుకురా?' అని అడిగింది కోంపడ్తూ

అబ్బాయి బిక్కమొగం వేశాడు. 'పారేసిరా' అంది. కుర్రాడు మాట్లాడలేదు.

అమ్మమ్మ అన్నయ్యచేత పిల్లి నెక్కడో విసిరేయించింది. అన్న పిల్లిపిల్ల చెవులు పట్టుకున్నాడు. ఉరికంబంమీద శవంలా పిల్లి ఊగింది. కుర్రాడికి శవాన్ని ఎత్తుతుంటే వచ్చే ఏడుపు వచ్చింది. లోలోపలే కుమిలికుమిలి ఏడ్చాడు. పిల్లి బక్కర్లు మంటపెడుతున్నాయి. అవి మానకుండానే పిల్లి వెళ్ళిపోయింది.

కుర్రాడు వీధిలోకి వెళ్ళి వీధంతా గాలించేడు, పిల్లి ఎక్కడా కనుపించలేదు. ఏ బండికిందపడ్డదో, ఏ కుక్కనోట పడ్డకో, ఏ కాలువలో పడ్డకో! కుర్రాడికి ఎక్కడలేని బెంగ పట్టుకుంది. కాలుకాలిన పిల్లిలాగ పిల్లికోసం రోడ్డంతా గుండం తొక్కాడు కుర్రాడు.

చీకటి జీమూతంలా కమ్మింది. కుర్రాడు ఇల్లుచేరుకున్నాడు. తిండితిని పడుకున్నాడు. ఎంతకీ నిద్రపట్టలేదు. కళ్ళువిప్పితే పిల్లిపిల్ల, కళ్ళుమూస్తే పిల్లిపిల్ల.

పట్టక పట్టక నిద్రపట్టింది. కలలోకూడా పిల్లిపిల్లే కనబడ్డది. తన అరుపుతో జాలిగా పిలుస్తోంది. వ్యక్తావ్యక్తపు స్థితిలో అన్నిచప్పుళ్ళూ కుర్రాడికి పిల్లికూనమూలుగులాగే వినిపిస్తున్నాయి. అరుపులన్నీ కుర్రాడిని తట్టి లేపాయి.

కుర్రాడు కళ్ళునలుపుకొని నించున్నాడు. తనపక్క అత్త ఏనుగులాగ పడుకొంది. చీకటి బూజుపట్లలాగ వేళ్ళా

డుతుంది. రోడ్డుమీద పిల్లిపిల్ల ఉంటుంది. తప్పదు. తెచ్చుకోవాలి. డాబాకు మెట్లులేన ట్లనిపించింది. కుర్రాడికళ్ళకి చింతతగిలించినట్టయింది.

కళ్ళంట నీళ్ళు పెట్టుకొని కుర్రాడు సాంబ్రాణి పొగ లాగ కూలబడ్డాడు. వాడి ఏడుపుకూడా పిల్లికూన మూలుగు లాగే ఉంది. అత్త కళ్ళిప్పి 'ఏం పడుకోర' అని తన దగ్గరకు తీసుకొని శాలువకప్పింది. తను అత్తయ్యను అంటిపెట్టుకొని పిల్లిపిల్లలాగ వెచ్చగా ముడుచుకుపడుకొన్నాడు.